7
సాక్షి విశాఖపట్నం
సోమవారం । 14 । ఏప్రిల్ । 2025


విద్యార్థినులు లాస్య, తనుశ్రీ, సుమేధలను తాళ్లతో బంధించి తీసుకొస్తున్న పురోహిత్ అలంకారి


స్థానాచార్యులు ప్రశ్నలు వేస్తుండటంతో కన్నీటి పర్యంతమైన కొత్తవలసకు చెందిన విద్యార్థినులు


కొత్త జంటను తాళ్లతో బంధించి తీసుకొస్తున్న పురోహిత్ అలంకారి

దర్శనానికి వచ్చి.. ఉంగరం దొంగిలిస్తారా?

- భక్తులను బంధించి ప్రశ్నించిన స్థానాచార్యులు
- కన్నీటి పర్యంతమైన యువత
- వినోదోత్సవమని తెలుసుకుని సంభ్రమాశ్చర్యం

8లో

ప్రమాదంలో మృతులు

1. దాడి రామలక్ష్మి (35), రాజుపేట
2. పురం పాప (40), కైలాసపట్నం
3. గుప్పిన వేణుబాబు (34), కైలాసపట్నం
4. సంగరాతి గోవిందు (40), కైలాసపట్నం
5. సేనాపతి పైడితల్లినాయుడు అలియాస్ బాబూరావు (60), చౌడువాడ
6. అప్పికొండ తాతబాబు అలియాస్ పల్లయ్య (50), కైలాసపట్నం
7. దేవర నిర్మల (38), వేట్లపాలెం
8. హేమంత్ మనోహర్ (20), భీమిలి

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

1. జల్లూరు నాగరాజు(50), రాట్నాలపాలెం
2. సియాద్రి గోవింద్(38), కైలాసపట్నం
3. వేలంగి సంతోషి (44), సామర్లకోట
4. వేలంగి సారోని(19), సామర్లకోట
5. మడగల జానకిరామ్(55), కైలాసపట్నం

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారు...

1. గంపెన సూరిబాబు(40), కైలాసపట్నం
2. సంగరాతి. శ్రీను(35), కైలాసపట్నం
3. వేలంగి రాజు (19), సామర్ల కోట)

పనికెళ్లిన నాలుగు రోజులకే..

బాణసంచా కేంద్రంలో ప్రమాదంలో మహాలక్ష్మీపురానికి చెందిన హేమంత్ మృతి


మెడిసి హేమంత్ (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని రేఖ వానిపాలెం పంచాయతీ మహాలక్ష్మీపురానికి చెందిన మెడిసి హేమంత్(24) ఇటీవల బాణసంచా తయారీ నేర్చుకున్నాడు. తెలిసిన వారి ద్వారా నాలుగు క్రితం కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా కేంద్రంలో పనికి వెళ్లాడు. బాణసంచా కేంద్రంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో అశువులుబాశాడు. అతని తండ్రి మెడిసి సత్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. తల్లి లేరు. అక్క స్వర్ణకల ఉన్నారు. తన కొడుకు ఇంటికి ఆధారంగా ఉంటాడని భావించామని.. త్వరలో వివాహం కూడా చేయాలని అనుకున్నామని.. ఇంతలో ఘోరం జరిగిపోయిందని తండ్రి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. అందరితో సరదాగా ఉండే హేమంత్ ఇకలేడన్న విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు విషాదం మునిగిపోయారు.

ఆదివారం మిట్ట మధ్యాహ్నం 12.30 గంటల సమయం..ఒకవైపు మండుతున్న సూర్యుడి భగభగలు.. మరోవైపు సెగలు కక్కుతున్న వాతావరణంలో పనిచేస్తున్న కార్మికులు.. ఊపిరి సలపని పని.. కడుపు ఆకలితో నకనకలాడుతోంది.. కాసేపట్లో పని చాలించి ఓ ముద్ద తిని వద్దాం.. అనుకుంటుండగా.. ఒక్కసారిగా భూమి దద్దరిల్లిన శబ్దం. దిక్కులు పిక్కటిల్లేలా కార్మికుల హాహాకారాలు.. క్షణకాలంలో తునాతునకలైన దేహాలు.. పూర్తిగా కాలిపోయిన శరీరాలు.. కాలిన గాయాలతో బాధితుల పెడబొబ్బలు.. ఒక్కసారిగా భీతిగొలిపే దృశ్యాలతో ఆ ప్రాంతం రక్తకాసారంగా మారిపోయింది. ఏం జరిగిందో తెలిసేలోగానే ఎనిమిది మంది అక్కడికక్కడే బుగ్గయిపోయారు.. మరో ఎనిమిది మంది క్షతగాత్రులుగా మారిపోయారు.. కోటవురట్ల మండలం కైలాసపట్నం సమీపంలోని విజయలక్ష్మి ఫైర్ వర్క్సులో సంభవించిన ఘోరప్రమాదం దృశ్యమిది.



పగిలిన గుండెలు

బాణసంచా కేంద్రంలో బతుకులు బుగ్గి ▪ కైలాసపట్నంలో ఘోర విషాదం

- మధ్యాహ్నం 12.30 గంటలకు భారీగా పేలుడు
- ఎనిమిది మంది దుర్మరణం, మరో ఎనిమిది మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- ప్రమాద సమయంలో కేంద్రంలో 16 మంది కార్మికులు
- విశాఖపట్నం, నర్సీపట్నం ఆస్పత్రులకు క్షతగాత్రుల తరలింపు
- పదేళ్ల క్రితం గోకులపాడులో ఇదే పరిశ్రమలో ప్రమాదం
- ఆ ఘటనలో ఎనిమిది మంది దుర్మరణం
- మళ్లీ దశాబ్దం తరువాత అదే ఘోర కలి
- భద్రతా తనిఖీల్లో లోపం...కార్మికులకు శాపం


బాధితుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

సాక్షి, అనకాపల్లి/కోటవురట్ల : పొట్టకూటి కోసం మందుగుండు సామగ్రి తయారు చేసేందుకు వెళ్లిన పలువురు కార్మికులు ఆ మందుగుండుకే ఆహుతయ్యారు. బాణసంచా కేంద్రంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదం పేద కార్మిక కుటుంబాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. మరికొందరు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం జరిగిన విస్ఫోటనం 8 మంది కార్మికుల ప్రాణాలను మింగేసింది. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. మిట్ట మధ్యాహ్నం కావడంతో గ్రామస్తులంతా ఇళ్లలో సేదతీరుతున్న సమయంలో ఒక్కసారిగా భూమి కంపించి అగ్ని ప్రకంపనలు సృష్టించినట్టుగా చుట్టూ పొగ, మంటలు కనిపించాయి. గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో గల బాణసంచా కేంద్రంలో సంభవించిన పేలుడు ధాటికి గ్రామస్తులు భీతావహులయ్యారు. మంటలు ఎగిసిపడుతుంటే ఆవైపు వెళ్లాలంటే భయం..మరో వైపు క్షతగాత్రుల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. దీంతో ఫైర్ ఇంజన్, 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు.


క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎంపీ గొల్ల బాబూరావు

ప్రమాదం జరిగిందిలా...

కైలాసపట్నంనకు చెందిన మడగల జానకీరాం తన తోడల్లుడు అప్పికొండ తాతబ్బాయి పేరున 'విజయలక్ష్మి ఫైర్‌వర్క్స్' మందుగుండు తయారీకి లైసెన్సు తీసుకుని 20 ఏళ్లుగా కేంద్రాన్ని నడుపుతున్నాడు. లైసెన్స్‌కు వచ్చే ఏడాది 2026 వరకు గడువు ఉంది. దీపావళితో పాటు సమీప మండలాల్లో పల్లెల్లో జరిగే గ్రామ పండుగలకు వచ్చే ఆర్డర్లపై మందుగుండు సామగ్రిని తయారు చేస్తారు. కొత్త అమావాస్య నుంచి వరుసగా పల్లెల్లో పండగలు జరుగుతున్న నేపథ్యంలో ఆర్డర్లు ఎక్కువగా వచ్చాయి. వర్క్‌లోడ్ ఎక్కువగా ఉండడంతో కార్మికులు ఒత్తిడితో పనిచేస్తున్నారు. సరిగ్గా 12.30 గంటల సమయంలో ఓ కార్మికుడు మందును దంచుతుండగా ఒక్కసారిగా విస్ఫోటనం సంభవించింది. వారం రోజులుగా తయారు చేసిన మందుగుండు సామగ్రి మొత్తం అక్కడే ఉండడంతో ఒక్కొక్కటిగా క్షణాల్లో అంటుకుపోయాయి. పక్కనే ఉన్న పౌడర్‌పై అగ్గి రేణువులు తూలి ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పనిచేస్తున్న కార్మికులు తేరుకుని తప్పించుకునే అవకాశం కూడా లేకపోవడంతో తీవ్రంగా కాలిపోయి 8 మంది కార్మికులు అక్కడికక్కడే మాడి మసైపోయారు. విస్ఫోటనం ధాటికి అక్కడ ఉన్న రేకుల షెడ్లు, రెండు చిన్న స్లాబ్ గదులు చెల్లా చెదురయ్యాయి. భూమి కంపించినట్టయి..పెద్దగా మంట రావడంతో గ్రామస్థులంతా అదిరిపడి ఒక్కసారిగా పరుగున వచ్చారు. వరహాలు అనే గ్రామస్తుడు ఫైర్ ఇంజిన్, 108కి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నర్సీపట్నం, నక్కపల్లి, కోటవురట్ల, ప్రభుత్వ ఆస్పత్రి 108 వాహనాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయి. సమీప నక్కపల్లి, నర్సీపట్నం, యలమంచిలి నుంచి మూడు ఫైర్ ఇంజిన్‌లు వచ్చాయి. మంటలు అదుపు చేయడానికి సుమారు 4 గంటల పాటు సమయం పట్టింది. ప్రమాదంతో అప్రమత్తమైన స్థానికులు, పోలీసులు గాయపడ్డ బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. విషమంగా ఉన్న వారిని కేజీహెచ్‌కు తరలించారు. మైనర్ గాయాలతో ఉన్న వారికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు.


క్షతగాత్రురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికుడు

ప్రమాద స్థలంలో భీతావహ దృశ్యాలు...

ఘటన సమయంలో మందుగుండు సామగ్రి దంచుతున్న మనోహర్ అనే వ్యక్తి తునాతునకలయ్యాడు. భారీ పేలుడుకు తల, కుడి చేయి ఎగిరిపోయినట్టు తెలుస్తోంది. మిగిలిన ఏడుగురు శరీరాలు పూర్తిగా కాలిపోయి విగతజీవులుగా కనిపించారు. ఇక గాయపడిన 8 మందిలో నాగరాజు (52)కు 90 శాతం కాలిన గాయాలతో, జానకీరాం (50)కు 60 శాతం కాలిన గాయాలతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కొంపముంచిన ఆర్డర్



గ్రామాల్లో వివిధ పండుగలు ఉన్నాయి. బాణసంచా సామగ్రి కావాలి అని ఆర్డర్ వచ్చింది. దీంతో రేయింబవళ్లు పనిచేస్తున్నారు. సెలవయినా ఆదివారం కూడా పనిచేశారు. పని ఒత్తిడిలో నిప్పు రవ్వలు వచ్చినా ఎవరు పెద్దగా పట్టించుకోలేదు. ఈ రవ్వల వల్ల పేలుడు జరిగి ఉండవచ్చు. ఈ సంఘటనలో బాణసంచా కంపెనీ యాజమాని కూడా గాయపడ్డారు. – అప్పారావు, నాగరాజు మేనల్లుడు, కైలాసపట్నం

11 మంది పని చేస్తున్నారు

ప్రతిరోజూ అక్కడ 20 నుంచి 30 మంది వరకు కార్మికులు పనిచేస్తారు. బాణసంచా కేంద్రంలో ప్రమాద ఘటన జరిగే సమయానికి 16 మంది మాత్రం ఉన్నారు. లేదంటే అపార ప్రాణ నష్టం జరిగి ఉండేదని అధికారులు చెబుతున్నారు. వచ్చే మంగళవారం కోటవురట్ల మండలంలో అన్నవరం, చౌడువాడ, పందూరు గ్రామాల్లో గ్రామ జాతర ఉత్సవాలు ఉండడంతో బాణసంచా ఆర్డర్లు ఎక్కువగా వచ్చాయి. దీంతో గత వారం రోజులుగా పని ఎక్కువగా చేస్తున్నారు. అయితే ఆదివారం కావడంతో అక్కడ పనిచేసే సామర్లకోటకు చెందిన ఒక కుటుంబం సంతకు వెళ్లేందుకు ఓనర్ నుంచి డబ్బులు తీసుకోవడానికి మాత్రమే వచ్చారు. దీంతో అక్కడ పనిచేసే 11 మందితో పాటు ఈ అయిదుగురూ ప్రమాదంలో గాయపడ్డారు.

పేలుడు ఘటన దురదృష్టకరం : హోంమంత్రి


కేజీహెచ్‌కు వస్తున్న మంత్రి అనిత, ఎంపీ రమేష్

ఎంవీపీకాలనీ : కైలాసపట్నం బాణ సంచా తయారీ కేంద్రం పేలుడు ఘటన అత్యంత దురదృష్టకరమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని ఆదివారం రాత్రి ఆమె ఎంపీ సీఎం రమేష్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఘటనలో మృతి చెందిన వారంతా ఐదేళ్లుగా ఆ బాణసంచా కేంద్రంలో పనిచేస్తున్నారన్నారు. 2026 వరకు ఆ కేంద్రా నికి లైసెన్స్ ఉందన్నారు. బాంబుల తయారీకి వినియోగించే పేలుడు పదార్థం చేజారడంతోనే ఈ ప్రమాదం జరిగిందనే విషయం ప్రాథమిక విచారణ లో తేలిందన్నారు. లోపల ఉన్న 16 మందిలో 8 మంది మృతి చెందగా 8 మంది గాయపడ్డారన్నారు. గాయపడిన వారిలో ఐదుగురికి కేజీహెచ్‌లో, ముగ్గురికి నర్సీపట్నం ప్రభుత్వాస్పత్రిలో వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. మృతులకు ప్రభుత్వం తరపున రూ.15 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించినట్లు తెలిపారు. మరో రూ.2 లక్షలు కేంద్రం నుంచి కూడా మంజూరవుతుందన్నారు. క్షతగాత్రులకు రూ.4 లక్షలు ఆర్థికసాయం అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు.

న్యూస్‌రీల్

అప్పన్నకు శ్రీ పుష్పయాగం

- ముగిసిన వార్షిక కల్యాణోత్సవాలు


శ్రీపుష్పయాగాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సాయంత్రం నుంచి స్వామికి శ్రీ పుష్పయాగాన్ని నిర్వహించారు. స్వామి కల్యాణ ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి,భూదేవి అమ్మవార్లకు పూల అలంకరణ చేసి ఆలయ కల్యాణమండపంలో శేష తల్పంపై ఆళ్వారులతో సహా వేంజేపచేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ద్వాదశి ఆరాధనలు, పలు రకాల పుష్పాలతో పుష్పాంజలి సేవ చేశారు. అనంతరం భోగమండపంలో ఉంజల్‌సేవ ఘనంగా నిర్వహించారు.

చందనోత్సవం సీఎఫ్‌వోగా మూర్తి

- సీఎఫ్‌వోగా తప్పుకున్న భ్రమరాంబ

సింహాచలం : ఈనెల 30న జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి రాష్ట్ర దేవదాయశాఖ తరపున చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఆ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్, ద్వారకా తిరుమల దేవస్థానం ఈవో ఎన్.వి.ఎస్.ఎన్.మూర్తిని దేవదాయశాఖ నియమించింది. కాగా చందనోత్సవం సీఎఫ్‌వోగా ఆ శాఖ అమరావతిలోని ప్రధాన కార్యాలయంలో ఆర్‌జేసీగా విధులు నిర్వర్తిస్తున్న డి.భ్రమరాంబని తొలుత నియమించారు. ఆమె ఇటీవల సింహగిరికి వచ్చి దేవస్థానం ఈవో, ఇంజనీరింగ్ అధికారులు, సెక్షన్ హెడ్‌లతో చందనోత్సవం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో వ్యక్తిగత కారణాలు ఉన్నాయంటూ సీఎఫ్‌వో బాధ్యతలు తప్పించాలని దేవదాయశాఖకి ఆమె విన్నవించుకున్నారు. దీంతో మూర్తిని సీఎఫ్‌వోగా నియమిస్తూ ఆ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీచేశారు.



ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఎడ్వర్డ్, అథ్లెట్లను తీర్చిదిద్దిన ఖాసీం దంపతులను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు, రీ యూనియన్ సభ్యులు

ఆ రోజుల్లో..

- సైకిళ్లపై గురువులొచ్చి శిక్షణనిచ్చేవారు
- చెప్పులతోనే సాధన చేసే వాళ్లం
- నాటి జ్ఞాపకాలను పంచుకున్న క్రీడా దిగ్గజాలు
- 1980–2003 'హాస్టల్' క్రీడాకారుల అ'పూర్వ'కలయిక

విశాఖ స్పోర్ట్స్: అర్ధ శతాబ్దం కిందట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా వసతి గృహాల్లో శిక్షణ పొంది.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన తెలుగు రాష్ట్రాల క్రీడాకారుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ఏపీ స్పోర్ట్స్ హాస్టలర్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో 'రీయూనియన్' పేరిట ఈ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పొందిన వారిలో కొంత మంది మరణించగా.. వారికి సంతాపం తెలిపారు.

గత వైభవం.. నేటి వాస్తవాలు

1980లో ప్రారంభమై 2003 వరకు కొనసాగిన క్రీడా వసతి గృహాలు.. ఎందరో ప్రతిభావంతులను దేశానికి అందించాయి. కాలక్రమేణా ఇవి క్రీడా అకాడమీలుగా, ప్రస్తుతం ఖేలో ఇండియా, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా రూపాంతరం చెందాయి. వసతి గృహాల్లో శిక్షణ పొందిన చాలా మంది క్రీడాకారులు తమ పాత రోజులను గుర్తు చేసుకున్నారు. ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సైతం సైకిల్‌పై వచ్చి తమకు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దిన వైనాన్ని, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన తమకు స్పోర్ట్స్ అథారిటీ కిట్లు అందించి ప్రోత్సహించడాన్ని గుర్తు చేసుకున్నారు. పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు షూలతో సాధన చేస్తే.. గ్రామీణ క్రీడాకారులు చెప్పులతో సాధన చేసి ఆత్మస్థైర్యం కోల్పోకుండా క్రీడల్లో రాణించినట్లు చెప్పారు. అయితే నాటి, నేటి పరిస్థితులకు చాలా తేడా ఉందని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత తరం క్రీడల కంటే చదువుకే ఎక్కువ ప్రాధాన్యమివ్వడం, సరైన వసతులు లేకపోవడం వంటి కారణాల వల్ల పతకాలు సాధించడం కష్టతరంగా మారిందని అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన ఈ క్రీడాకారులు గతంలో హైదరాబాద్ వేదికగా మూడు సార్లు కలిసినప్పటికీ.. విశాఖలో కలవడం ఇదే తొలిసారి. తమ క్రీడా నైపుణ్యానికి మెరుగులు దిద్దుకున్న ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ప్రముఖుల సత్కారం

ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్ పి.వి.జి.ఆర్ నాయుడు మాట్లాడుతూ ఇలాంటి క్రీడాకారుల అనుభవాలు రాబోయే తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఒక పతకం సాధించడం వెనుక ఎంతో శ్రమ, గుర్తింపు ఉంటాయని, తాను కూడా జాతీయ శిబిరాల్లో క్రీడాకారులతో గడిపిన రోజులను గుర్తుచేసుకున్నారు. త్వరలో విశాఖ సాగర తీరంలోని బ్యాంక్స్ రింక్‌లో ఆసియన్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ జరగనుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఒలింపిక్స్‌లో హాకీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఎడ్వర్డ్, ఎందరో అథ్లెట్లను తీర్చిదిద్దిన కోచ్ ఖాసీం, ఎస్ఏఎఫ్ క్రీడల్లో స్వర్ణం సాధించిన రామిరెడ్డి, డాక్టరేట్లు సాధించిన క్రీడాకారులను నిర్వాహకులు సత్కరించారు.

ఏం చేయాలో ఆలోచించాలి



క్రీడల ద్వారానే మనం గుర్తింపు పొందాం. ఉన్నత స్థితికి ఎదిగాం. ఒకప్పుడు మనకు క్రీడల్లో శిక్షణ ఇచ్చిన గురువులను ఇప్పటికీ గౌరవిస్తున్నాం. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ఒకప్పుడు హాస్టల్స్ నుంచి కిట్లు, ఆర్థిక సహాయం పొందాం. ఇప్పుడు ఆ సహాయాన్ని ఈ తరం వారికి అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇందుకోసం ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. –క్రీడల్లో డాక్టరేట్ అందుకున్న అనిత

అథ్లెట్లు.. తీరప్రాంతాల వారే..



భారతదేశం గర్వించదగ్గ అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లలో చాలా మంది తీర ప్రాంతాలకు చెందిన వారే కావడం గమనార్హం. 1980లో క్రీడా హాస్టల్స్‌ను స్థాపించడం వల్ల ఎంతో మంది ప్రతిభావంతులకు క్రీడాకారులుగా ఎదిగే అవకాశం లభించింది. క్రీడలను మరింతగా ప్రోత్సహించడానికి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడం అవసరం.
– రామిరెడ్డి, అంతర్జాతీయ అథ్లెట్, విశాఖ

క్రీడాకోటా అమలు చేయాలి



క్రీడాకారులకు ఉద్యోగాల్లో రెండు శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలి. క్రీడల్లో రాణించిన వారికి తగిన గుర్తింపు లభించాలి. మన క్రీడాకారులు జాతీయ పతాకాన్ని ప్రపంచ వేదికలపై రెపరెపలాడించేలా నాణ్యమైన శిక్షణ ఇవ్వాలి. ప్రాథమికస్థాయిలో క్రీడా వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– కోటేశ్వరరావు, డీఎస్పీ

మౌలిక సదుపాయాలు అవసరం



ఆటల్లో శిక్షణ ఎంత ముఖ్యమో.. టోర్నీల్లో పాల్గొనడం కూడా అంతే అవసరం. నేను 1974లో ఫుట్‌బాల్‌లో అడుగుపెట్టాను. ఆ తర్వాత హాస్టల్‌లో మొదటి బ్యాచ్‌లోనే శిక్షణ ద్వారా ఆటలో మెరుగులు దిద్దుకున్నాను. అప్పట్లో ఒలింపియన్స్ కూడా ఉదయం ఐదు గంటలకే సైకిల్‌పై వచ్చి మరీ శిక్షణ ఇచ్చేవారు. నేడూ అలాంటి నిబద్ధత అవసరం. క్రీడా సదుపాయాలు మరింతగా అభివృద్ధి చెందాలి. అప్పుడే భవిష్యత్ తరాలు మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోగలవు. – వెంకటేశ్వర రెడ్డి, తొలి బ్యాచ్ శిక్షణార్థి



నిప్పుల కుంపటి

- రోజు రోజుకీ పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- రెండు రోజులుగా 38 డిగ్రీలకు పైగా నమోదు
- అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో అటు వర్షాలు, ఇక్కడ ఎండలు

సాక్షి, విశాఖపట్నం : నగరం నిప్పుల కొలిమిలా మారింది. రెండు రోజులుగా కాస్తున్న ఎండ నడివేసవిని తలపించింది. రోహిణి రాకముందే.. రోళ్లు పగిలిపోతున్నాయి. నగరంలో రెండు రోజులుగా 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతుంది. సెగలు కక్కిన భానుడి భగభగల ధాటికి నగరవాసుల నాలుక పిడచకట్టుకుపోతుంది. ఈ వేసవిలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో సాధారణం కంటే 3 డిగ్రీల వరకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. అయితే మార్చి నెలాఖరు నుంచే నగరంలో సెగలు పెరిగాయి. ఏప్రిల్ రెండో వారానికి తారాస్థాయికి చేరుకుంది. గత రెండు రోజులుగా సాయంత్రం సమయంలో మేఘావృత వాతావరణంతో కాసింత ఊరట చెందుతున్నా.. ఉదయం కాస్తున్న ఎండకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉక్కపోత విపరీతంగా ఉంది. వేడిగాలులు వస్తుండటంతో.. వాహనదారులు, ప్రయాణికులు ఆపసోపాలు పడుతున్నారు. ఈసారి జీవీఎంసీ చలివేంద్రాల ఏర్పాటులో విఫలమైంది. చలివేంద్రాల కోసం టెంట్లు మాత్రమే వేశారు తప్ప నీటిని అందుబాటులో ఉంచలేదు.

అకాల వర్షాల ప్రభావంతో..

వేసవి మొదలైన సమయంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. శివారులో చుట్టుపక్కలా వర్షాలు కురవడం, నగర పరిధిలో వానలు ఆశించిన స్థాయిలో పడకపోవడం కూడా ఈ విపరీత వాతావరణానికి ఒక కారణమంటున్నారు. ఇటీవల పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ద్రోణి ప్రభావంతో గాలిలో తేమ మొత్తం ఆవిరైపోయింది. దీంతో వాతావరణం పొడిబారిపోవడం వల్ల పరిస్థితి దారుణంగా మారింది. ఈ కారణంగానే ఉష్ణోగ్రతలు 37, 38 డిగ్రీలకు నమోదవుతున్నా.. ఉష్ణతాపం మాత్రం 45 నుంచి 50 డిగ్రీల వరకూ ఉంటోందని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదవుతుండటం వల్ల.. ఈ ఎండ ధాటికి నీటి ఆవిరి మళ్లీ పెరగనుందనీ.. ఫలితంగా భవిష్యత్తులో వేడి వాతావరణం మరింత కలవరపెడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లొద్దని.. ఎండ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

ఆదివారం నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు

భీమిలి	39.0 డిగ్రీలు
సింహాచలం	38.1
గాజువాక	37.4
మహారాణిపేట	37.0
షీలానగర్	36.0
ఆరిలోవ	35.6
ద్వారకానగర్	35.4



దర్శనానికి వచ్చి.. ఉంగరం దొంగిలిస్తారా..?


స్థానాచార్యులు, ఈవోతో వాగ్వాదం చేస్తున్న పలాసకు చెందిన లా విద్యార్థినులు శశిరేఖ, తమనశ్రీ


ఉంగరాన్ని చూపిస్తున్న పురోహిత్ అలంకారి

సింహాచలం: 'శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చి ఆయన ఉంగరాన్నే దొంగిలిస్తారా... మర్యాదగా దొంగిలించిన ఉంగరాన్ని ఇచ్చేయండి.. లేదంటే పోలీసులకు అప్పగిస్తాం'.. అని సింహగిరికి వచ్చిన పలువురు భక్తులను దేవస్థానం స్థానాచార్యులు ప్రశ్నించేసరికి వారంతా కంగుతిన్నారు. 'మేం దొంగల్లా కనిపిస్తున్నామా... స్వామి దర్శనానికి వస్తే ఉంగరాన్ని దొంగతనం చేశారంటారేంటి? పైగా తాళ్లతో బంధించి తీసుకొస్తారా'.. అంటూ భక్తులు ఆవేశంతో స్థానాచార్యులపై గర్జించారు. 'చూడండీ.. మీరు దొంగతనం చేసినట్లు మా దగ్గర ఆధారాలున్నాయి. సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. పోలీసులు తీసుకెళ్లకముందే దొంగిలించిన ఉంగరాన్ని మర్యాదగా ఇచ్చేయండి'.. అంటూ స్థానాచార్యులు మరింత గర్జించి అడగడంతో భక్తుల కళ్లంట నీళ్లు గిర్రున తిరిగాయి. తాము ఉంగరం తీయలేదని ఎంతచెబుతున్నా వినకుండా మీరే దొంగ అని పదే పదే ప్రశ్నించడంతో వారంతా కోపోద్రేకాలతో చిందులు వేశారు. పైగా చేతికున్న ఉంగరాలను చూపెట్టమని... దొంగిలించిన ఉంగరం ఇలాగే ఉంటుందంటూ స్థానాచార్యులు నిలదీయడంతో భక్తులు నోటి మాట రాలేదు. చివరికి ఇదంతా వినోదోత్సవంలోని ఘట్టమని తెలుసుకుని సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. తమకు మాత్రమే దక్కిన భాగ్యంగా భావించి ఆనందభరితులయ్యారు. ఇదీ.. సింహగిరిపై ఆదివారం సందడిగా జరిగిన స్వామి వినోదోత్సవం. సింహగిరిపై జరుగుతున్న స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి జరిగిన మృగయోత్సవంలో పోయిన స్వామి ఉంగరాన్ని వెతికే ఘట్టాన్ని ఆదివారం ఉదయం వినోదోత్సవంగా నిర్వహించారు.

ఉత్సవం సాగిందిలా...

ఏడు పరదాల్లో దాగి ఉన్న స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రాజగోపురం వద్ద పల్లకీలో అధిష్టంపజేశారు. స్వామి దూతగా పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కర్ర, తాడు పట్టుకుని దర్శనానికి వచ్చిన పలువురు భక్తులను ఉంగరం దొంగిలించారంటూ తాడుతో బంధించి రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్ దొంగిలించిన ఉంగరాన్ని ఇవ్వాలంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఉత్సవం గురించి తెలియని వాళ్లు కన్నీటిపర్యంతం చెందారు. ఉత్సవం గురించి తెలిసిన వాళ్లు నవ్వుతూ సమాధానం చెప్పారు. ఈ తరుణంలోనే స్వామిపై ఉన్న ఒక్కొక్క పరదాని తొలగించారు. చివరికి ఆయన చివరి పరదాలోనే ఉంగరం దొరికింది. విశాఖలోని గాయత్రి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న లాస్య, తనుశ్రీ, సుమేధలను, కొత్తవలసకి చెందిన భార్గవి, మోహిత, శ్రావణ్ అనే విద్యార్థులను, విజయనగరానికి చెందిన ఎంబీఏ విద్యార్థినులు రూప, కుసుమ, పుష్ప, సౌమ్యలను, పలాసకి చెందిన ఫైనలియర్ లా విద్యార్థినులు శశిరేఖ, తమనశ్రీ, నరేణ్యలను, మర్రిపాలెంలోని ఓ గోల్డ్ షాపులో పని చేస్తున్న వడ్లాదికి చెందిన వీర వెంకట సత్యనారాయణ అనే భక్తుడుని పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తాళ్లతో బంధించి తీసుకురాగా వారిని స్థానాచార్యులు ప్రశ్నించారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌కి చెందిన భక్తులను, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న యలమంచిలికి చెందిన సత్యనారాయణ మూర్తి కుటుంబాన్ని, పెళ్లి చేసుకొని స్వామి దర్శనానికి వచ్చిన నూతన జంటలను తాళ్లతో బంధించారు. వాళ్ల చేతికి ఉన్న ఉంగరం.. దొంగిలించిన ఉంగరం గానే ఉందని స్థానాచార్యులు, అర్చకులు అనుమానం వ్యక్తం చేయడంతో వారందతా వాదనకు దిగారు. ఆ తర్వాత నవ్వుతూ స్వామి ఆశీస్సులు తీసుకుని తిరుగుపయనం అయ్యారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు దంపతులు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు, ఆలయ కొత్వాల్ నాయక్ లంక సూరిబాబు, ఆలయ ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు దొంగలుగా పట్టుబడ్డారు. తొలుత స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్‌ని, ఆఖరులో పురోహిత్ అలంకారి సీతారామాచార్యులను తాడుతో బంధించి తీసుకురావడం విశేషం.

జలపాతంలో ఇద్దరు యువకుల గల్లంతు


వాసు(ఫైల్)

సాక్షి, పాడేరు/జగదాంబ: జీనబాడు పంచాయతీ సరియా జలపాతంలో ఇద్దరు యువకులు గల్లంత య్యారు. పూర్ణామార్కెట్‌కు చెందిన ఆరుగురు యువకులు సరియా జలపాతం సందర్శనకు ఆదివారం వెళ్లారు. జలపాతంలో స్నానం కోసం దిగిన సమయంలో ప్రమాదవశాత్తు పూర్ణామార్కెట్ పండావీధికి చెందిన ఇల్లా వాసు(22), నర్సింహం జారిపడి గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం మిగిలిన నలుగురు, స్థానికులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిచిపోయాయి. నలుగురు యువకులు అనంతగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి బయలుదేరారు. గల్లంతైన ఇద్దరూ ఫిషింగ్ హార్బర్‌లోని చేపల దుకాణాల్లో పనిచేస్తున్నారు.

భారత కబడ్డీ జట్టుకు ఎండాడ మహిళ ఎంపిక


కొప్పాన గౌరి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ప్రాంతానికి చెందిన వివాహిత కొప్పాన గౌరి భారత కబడ్డీ జట్టుకు ఎంపికైంది. వచ్చే జూన్‌లో బిహార్‌లో జరగనున్న రెండవ ప్రపంచ కప్ మహిళా కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. ఆమె తాడేపల్లిగూడెంలోని పోస్టల్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్గొని అనేక పతకాలు కైవసం చేసుకుంది. భారత కబడ్డీ జట్టులో రాష్ట్రం తరఫున ఆమెకు స్థానం దక్కడం అభినందనీయమని అథ్లెటిక్ శిక్షకుడు వైకుంఠరావు అన్నారు. ఎండాడ గ్రామపెద్దలు, క్రీడాకారులు ఆమెను అభినందించారు.

నా బంగారు కూన..




తల్లి పాలు తాగుతున్న కృష్ణ జింక పిల్ల




తల్లి పాలు తాగుతున్న బార్కింగ్ డీర్


తల్లి వెంట మౌస్‌డీర్ పిల్ల

ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో గణనీయంగా జింక జాతి వృద్ధి చెందుతోంది. వివిధ జాతుల జింకలు ఇటీవల పిల్లలకు జన్మనిచ్చాయని జూ క్యూరేటర్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జూ సిబ్బంది పర్యవేక్షణలో పిల్లలన్నీ ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉన్నాయని వివరించారు. ప్రత్యేకించి మౌస్ డీర్, బార్కింగ్ డీర్, సాంబార్ డీర్, చుక్కల జింక, నీల్‌గై, కృష్ణ జింక పిల్లలకు జన్మనిచ్చినట్లు చెప్పారు. ఒక మౌస్ డీర్ పిల్ల, రెండు బార్కింగ్ డీర్ పిల్లలు తమ తల్లుల వెంట తిరుగుతూ సందడి చేస్తున్నాయి. అలాగే మూడు నీల్‌గై పిల్లలు(నీలి ఎద్దు), ఐదు సాంబార్ డీర్(కనుజు) పిల్లలు మాతృ ప్రేమ ఒడిలో హాయిగా గడుపుతున్నాయి. ఏడు చుక్కల జింక పిల్లలు (స్పాటెడ్ డీర్), తొమ్మిది కృష్ణ జింక పిల్లలు (బ్లాక్ బక్) సైతం తమ తల్లుల చెంత ఆటలాడుకుంటున్నాయి. ఇలా జింక పిల్లల సందడితో జూ ప్రాంగణం ఆహ్లాదకరంగా మారిందని క్యూరేటర్ సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ చిన్నారి జింకలను వాటి ఎన్‌క్లోజర్‌లలో సందర్శకుల కోసం విడిచిపెడతామని వెల్లడించారు. – ఆరిలోవ

రాజ్యాంగ పరిరక్షణకు కలిసి పోరాడాలి

- సినీనటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపు


కళారూపాల శంఖారావంలో మాట్లాడుతున్న సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

డాబాగార్డెన్స్: రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి పోరాడాలని పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ప్రజానాట్య మండలి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం పేరిట కళారూపాల శంఖారావం జరిగింది. బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన ర్యాలీని ఆర్.నారాయణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి డప్పులు, తీన్మార్, కోలాటాలు, నృత్యాలు, నాటికలు వేసే కళాకారులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. డాబాగార్డెన్స్ లోని అల్లూరి విజ్ఞాన భవన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సభలో నారాయణమూర్తితో పాటు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, ఆంధ్రా మాల్యాద్రి, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి అరుణ్, వై.రాజు అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దళితులు, మైనార్టీలపై దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రశ్నించేవారి గొంతు నొక్కుతోందన్నారు. కార్మిక చట్టాలను మార్చి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. నారాయణమూర్తి మాట్లాడుతూ దేశంలోని కార్మికులు, పీడితులు, దళిత బడుగు బలహీన వర్గాల కోసం పోరాడేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రా మాల్యాద్రి మాట్లాడుతూ దళితుల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కోసం కేవీపీఎస్ నిరంతరం పోరాడుతోందన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. థింసా నృత్యం, రాజ్యాంగ పరిరక్షణకు నాటిక, బాలబాలికల నృత్య ప్రదర్శనలు, మహిళల కోలాటాలు అలరించాయి. అంబేడ్కర్ వేషధారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో జి.రమణ, టి.చిరంజీవి, ఎం.చంటి, సుబ్బన్న, వై.రాజు, కె.సత్యనారాయణ, జి.స్టాలిన్, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. అప్రమత్తతే కీలకం

- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు
- ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం


సూర్యాబాగ్ అగ్నిమాపక కేంద్రం

అల్లిపురం: రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్నాయి. పెరుగుతున్న వేసవి తాపం అగ్ని ప్రమాదాలకు ఆజ్యం పోసేలా ఉంది. వేసవిలోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగి, అపార నష్టాలను మిగుల్చుతున్నాయి. అసలు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉంటే నష్ట తీవ్రతను తగ్గించవచ్చు. దీనిపై జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యపరచడంతోపాటు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. జాతీయ అగ్నిమాపక దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.రమణయ్య తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం పరిపాటి. 1944 ఏప్రిల్ 14న ముంబయిలోని విక్టోరియా డాక్‌యార్డ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో అధికారులు, సిబ్బంది, సామాన్య ప్రజలతో సహా 66 మంది మరణించగా, 87 మంది గాయపడ్డారు. ఈ అగ్నిప్రమాద ఘటనకు గుర్తుగా ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నినాదం 'అగ్ని సురక్షిత భారతదేశానికి ఐక్యమవ్వండి'. నగరంలోని సూర్యాబాగ్, మర్రిపాలెం, పెదగంట్యాడ, ఆటోనగర్, చిట్టివలస ప్రాంతాల్లోని అగ్నిమాపక కేంద్రాల్లో వారోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు చేయాల్సిన ఫోన్ నంబర్లు

డయల్	101, 112
విశాఖపట్నం	: 0891-2563582, 2787818, 99637 28301
పెదగంట్యాడ	: 0891-2517780, 2515233, 99637 28664
మర్రిపాలెం	: 0891-2558470, 99637 29367
చిట్టివలస	: 08933-295101, 99637 28726
ఆటోనగర్	: 0891-2515101, 99637 28664

ప్రేక్షకులను నవ్వించే మాట నిలబెట్టుకున్నాం

- హీరో ప్రదీప్ మాచిరాజు



మాట్లాడుతున్న హీరో ప్రదీప్. చిత్రంలో హీరోయిన్ దీపిక, గెటప్ శ్రీను

డాబాగార్డెన్స్: 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం మంచి విజయం సొంతం చేసుకుందని హీరో ప్రదీప్ మాచిరాజు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన చిత్ర విజయోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ చిత్రం ప్రేక్షకులను ఆద్యంతం నవ్విస్తుందని తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. ఈ సినిమాకు మద్దతు తెలిపిన మహేష్‌బాబు, రాంచరణ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఏప్రిల్ 11 తన జీవితంలో మరచిపోలేని రోజని, ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఇలాంటి స్వచ్ఛమైన కామెడీ ఎంటర్‌టైనర్ చూశామని ప్రేక్షకులు చెబుతుంటే మరింత సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కథను రాసి తమను భాగం చేసిన దర్శకులు నితిన్, భరత్‌లకు ధన్యవాదాలు తెలిపారు. హీరో నాని కూడా త్వరలో ఈ సినిమా చూడనున్నారని చెప్పారు. కమెడియన్ గెటప్ శ్రీను మాట్లాడుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే మంచి పాత్ర ఇచ్చినందుకు దర్శకులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, సత్య వంటి నటులతో కలిసి నటించడం ఆనందంగా ఉందన్నారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ ప్రేక్షకులు తమ చిత్రాన్ని ఇంతగా ఆదరించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

కేజీహెచ్‌లో రెండు పూటలా సూపర్ స్పెషాలిటీ ఓపీ సేవలు

- సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద


మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

మహారాణిపేట: కేజీహెచ్‌లో కొత్తగా రెండు పూటలా ప్రారంభించిన సూపర్ స్పెషాలిటీ విభాగాల సేవలను రోగులు వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద పేర్కొన్నారు. ఆదివారం ఆసుపత్రిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వారానికి మూడు రోజులు నిర్వహించే ఓపీ సేవలు.. ఈనెల 5వ తేదీ నుంచి ఆదివారం మినహా మిగతా అన్ని రోజులు అందిస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఓపీ సేవలు అందుతాయన్నారు. కేజీహెచ్‌లోని అన్ని విభాగాలను కంప్యూటరీకరణ చేస్తున్నామన్నారు. వార్డుల్లో టాయిలెట్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి రోగులు వారి బంధువులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని, సాధారణ రోగులకు వారానికి సరిపడే మందులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడ మందులు ఇస్తున్నట్లు చెప్పారు. మందుల కొనుగోలుకు ప్రభుత్వం రూ.7.5 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవిలత, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ మోహర్ కుమార్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాల్సిందే..



వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ముస్లింలు

డాబాగార్డెన్స్: వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలంటూ ముస్లింలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ కూడలి నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు చేపట్టిన ఈ శాంతియుత ర్యాలీలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. తక్షణమే వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కితీసుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది మహమ్మద్ గౌస్ ముద్దిన్ ఖాన్, ముస్లిం నాయకులు హైదర్ అలీ సింకా, జహీర్ అహ్మద్, ఆల్ మాస్క్ ప్రెసిడెంట్ అహ్మదుల్లా ఖాన్, మక్కా మసీద్ ప్రెసిడెంట్ మున్నీర్, యాసిన్ మసీద్ అసిస్టెంట్ సెక్రటరీ మహమ్మద్ ఇబ్రహీం, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఫరూఖీ, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆనందం



ఏయూక్యాంపస్: నగరవాసులకు ఆదివారం సాయంత్రం ఆహ్లాదకరమైన అనుభూతిని పంచింది. ఎండ తీవ్రతతో ఉదయం నుంచి ఇబ్బంది ప్రజలు.. సాయంత్రం చల్లని గాలులు వీయడంతో బీచ్‌లకు చేరుకున్నారు. దీంతో నగరంలోని ఆర్.కె. బీచ్ నుంచి వీఎంఆర్డీఏ పార్క్ వరకు ఉన్న సాగర తీరం జనంతో కిటకిటలాడింది. చిన్న పిల్లలు ఇసుకలో ఆడుకుంటూ, గవ్వలు ఏరుకుంటూ సందడి చేశారు. కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా గడిపారు. కొందరు పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ.. ఆనంద క్షణాలను తమ కెమెరాల్లో బంధించారు. మరికొందరు పతంగులు ఎగురవేస్తూ ఎంజాయ్ చేశారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

డ్రెడ్జింగ్.. అంత ఈజీ కాదు!



ఏయూక్యాంపస్: సముద్రంలో నుంచి ఇసుకను తోడి తీరంలోకి వేయడం అంత సులభమైన విషయం కాదు. దీనికి వాతావరణం అనుకూలించాలి. అనేక యంత్రాలు, వ్యక్తులు, వ్యవస్థలు సమష్టిగా కలిసి పనిచేయాలి. ఇందుకు ఈ చిత్రాలే నిదర్శనం. వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో విశాఖ తీరంలో జరుగుతున్న డ్రెడ్జింగ్ ప్రక్రియ ఇటీవల నిలిచిపోయిన సంగతి తెలిసిందే. తాజాగా ఇందుకు సంబంధించిన పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. తీరంలో ఒక పక్కకు వచ్చేసిన ట్యూబ్‌ను తిరిగి సముద్రంలోకి చేర్చే పనిలో సిబ్బంది తలమునకలయ్యారు. ఇందుకోసం రెండు మరపడవలు, మరొక చిన్న పడవ అక్కడకు చేరుకుంది. ట్యూబులకు తాడు కట్టి ఎంతో కష్టం మీద సరి చేశారు. ఎంతో సాహసంతో కూడుకున్న ఈ పనిని సిబ్బంది ఎంతో ఓర్పు, నేర్పుతో పూర్తి చేశారు.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బాలికలతో బాబాయ్ అసభ్య ప్రవర్తన

- పోలీసుల అదుపులో నుంచి నిందితుడు పరారీ

మర్రిపాలెం: అన్న కుమార్తెలతో ఓ ప్రబుద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. కన్న తండ్రిలా కాపాడాల్సిన వ్యక్తి వారిపైనే దాడికి దిగాడు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ ఘటన వెలుగుచూసింది. కంచరపాలెం ధర్మానగర్ రాములవారి వీధిలో భార్యాభర్తలు తమ ముగ్గురు కుమార్తెలతో కలిసి నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటల సమయంలో తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో లేరు. ఆ సమయంలో బాలికల బాబాయ్ సురేష్ ఇంట్లోకి ప్రవేశించాడు. వారి మూడో కుమార్తె దుస్తులు మార్చుకుంటుండగా అతను గదిలోకి రావడంతో.. ఆమె కంగారుపడింది. వెంటనే బాత్రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకుని దాక్కుంది. పెద్ద కుమార్తె, రెండో కుమార్తె అతన్ని అడ్డుకుని వెళ్లొద్దని వారించినా.. వారితో అసభ్యకరంగా మాట్లాడుతూ దుర్భాషలాడాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న బాలికల నానమ్మ, తల్లి, తండ్రి అతడిని నిలదీయగా వారిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని సురేష్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో అతడు అక్కడి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. గతంలో పోర్ట్‌టౌన్ పరిధి అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో జరిగిన ఓ హత్య కేసులో అతను నిందితుడు. ఈ నెల 28న ఆ కేసుకు సంబంధించి వాయిదాకు సురేష్ కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. కాగా.. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విచారణ జరుగుతున్న సమయంలో రాత్రి 8 గంటల ప్రాంతంలో సురేష్ పోలీస్ స్టేషన్ నుంచి పారిపోవడం చర్చనీయాంశమైంది. అయితే పోలీసులు అదేమి లేదని కొట్టిపారేయడం గమనార్హం.

అక్రమ కేసులతో జైలుకు పంపింది

- పోలీసుల ఎదుటే చెప్పుతో దాడి చేసింది
- టీడీపీ మహిళా నేత సర్వసిద్ధి అనంతలక్ష్మిపై బాధితుడి ఆరోపణలు

డాబాగార్డెన్స్: టీడీపీ మహిళా నేత సర్వసిద్ధి అనంతలక్ష్మి తనను, తన తండ్రిని, సోదరుడిని అక్రమ కేసుల్లో ఇరికించిందని గాజువాకకు చెందిన కొత్తూరు నరేంద్ర ఆరోపించారు. అంతేకాకుండా, పోలీసుల సహాయంతో ఆమె తనను 23 రోజుల పాటు జైలుపాల్జేసిందని ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యాపారాన్ని ఆమె తీవ్రంగా నష్టపరిచిందన్నారు. వాస్తవానికి అనంతలక్ష్మికి తనకు ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసినట్లు తనపై తప్పుడు కేసులు బనాయించిందన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తనకు జరిగిన అన్యాయం గురించి గాజువాక పోలీసులకు చెబుతున్న సమయంలో.. అనంతలక్ష్మి పోలీసు అధికారి ఎదుటే తనను చెప్పుతో కొట్టిందన్నారు. అధికారం ఉందనే అహంకారంతో ఆమె ప్రవర్తిస్తోందని నరేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.